

# తక్కిన ఇద్దరూ...?

సందు మళుపు తిరుగుతూండగా రివ్వుమని దూసుకుపోయింది ఆ కారు !—ఇంకానయం, కాస్తలో తప్పింది గండం లేచిన వేళా విశేషం ఇవాళ బాగుంది

మళుపు తిరిగిన కారు దాని మానాన అది వెళ్ళిపోలేదు కాస్త దూరంలో ఆగింది ఆ కారులోవున్న వ్యక్తి - నల్లటి సూటులోవున్న ఆ వ్యక్తి - నల్ల కళ్ళజోడు ధరించిన ఆ వ్యక్తి నన్నే పరకాయించి చూస్తున్నాడు నన్నే చూస్తున్నాడు !—

అప్పుడు రోడ్డుమీద నర సంచారం కూడా లేదు

నాకు ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకినట్టయింది నే చదివిన డిటెక్టివ్ సాహిత్యమంతా ఒక్కసారి కళ్ళకు కట్టినట్టయింది

ఆగిన ఆ కారు అమట్టునే వెనక్కి రావడం చూశా కాళ్ళూ చేతులూ వణకసాగాయి. ముచ్చెమటలూ పోశాయి.

నా దగ్గరసా వచ్చింది కారు ఆగింది.

కారులో వ్యక్తి కళ్ళజోడుతీశాడు నాకేసి ఎగాదిగా చూశాడు

"నువ్వు ఫలానా కదూ ?" అని అడిగాడు.

నాకు మాట రాలే

"మీది పిఠాపురం కదూ ?"

"అవును "అన్నా ఆశ్చర్యంతో

"చిన్నప్పుడు మనిద్దరం కలిసి చదువుకున్నాం గుర్తొచ్చానా ?—"

అంటూ కారు దిగాడు ఆ వ్యక్తి.

"హరీ—నువ్వా, శ్రీహరివా !—"

అంటూండగానే, అమాంతం కావులించేసుకుని, "ఆఁ ! — ఎంతకాలానికి కలుసుకున్నాంరా !" అన్నాడు

మా యిద్దరి కళ్ళమ్మటా జలజలమని నీళ్ళు రాలాయి

---

ముద్దా విశ్వానాథం

---

ఇద్దరం కాసులో సాగిపోయాం

*　　*　　*

శ్రీహరి నేనూ కలిసి చదువుకున్నాం ఒకే వూళ్ళో, ఒకే స్కూల్లో ఒకే క్లాసులో, ఒకే సెక్షన్‌లో, ఒకే బెంచీలో పక్కపక్కని కూచుని చదువుకున్నాం స్కూల్ ఫైనల్ అయేవరకూ కలిసి చదువుకున్నాం

ఇద్దరమూ తెలివయినవాళ్ళమే అయితే ఇద్దరికీ ఒక్కటే తేడా — నాకు డ్రాయింగులోనూ, తెలుగులోనూ, నూటికి తొంభై తొమ్మిదిన్నర మార్కులొస్తే, వాడికి లెక్కల్లో నూటికి నూటయాభై మార్కులొచ్చేవి

స్వగ్రామం వదిలాక ఇదే మేమిద్దరం కలియడం, శ్రీహరి గొప్ప ఇంజనీరు అయ్యాడు నాలుగు రాళ్ళు వెనకేశాడు నేనో? — అది కాదని ఇది, ఇది కాదని అది, రకరకాల ఉద్యోగాలు చూసి చూసి, చివరికి జర్నలిస్టునయ్యాను జర్నలిస్టుగా నే చేసిందీ, పెద్ద యేమీ కనబడదు వెనకటి కొక మిత్రుడన్నట్టుగా నేనొక పాతకాలపు రచయితని అంతే

నన్ను తిన్నగా వాళ్ళింటికి తీసుకెళ్లాడు, శ్రీహరి ఎయిర్-కండిషన్ చేసిన ఆఫీసు రూంలోకి వెళ్లాం మనసు విప్పి మాటాడుకుంటున్నాం అయిదు నిమిషాలయింది

తలుపు తీసుకుని - రెండు ప్లేట్లతో ఫలహారం, రెండు కప్పుల కాఫీతో హాజరయింది ఆమె నేననుకున్నట్టు ఆమె శ్రీహరి సతీమణే శ్రీహరే పరిచయం చేశాడు

శ్రీహరి కొక కొడుకు కూడాను ఇంకా కుర్రవాడు ఐదో క్లాసు చదువుతున్నాడు

ఎవళ్ళ కథ వాళ్లం చెప్పుకున్నాం భోజనం చేస్తేగాని వదలనన్నాడు, శ్రీహరి కాని, ఆఫీసుకి టైమయిపోయిందని చెప్పి ఆ పూటకి తప్పించుకున్నా

"సరేలే, ఈ పూటకి తప్పించుకున్నా, సాయంత్రానికి వదిలేదిలేదు మర్యాదాగా, ఆఫీసు వదిలిపెట్టగానే ఇక్కడికి చేరుకో" అంటూ, అప్పటి మట్టుకు వదిలాడు

*　　*　　*

శ్రీహరి ఇంటినించి వచ్చినప్పటినించీ నన్నొక చిన్న సందేహంపట్టి పీడిస్తూంది ఎంత గింజుకున్నా బుర్ర పాడవుతూందే కానీ, సమాధానం మాత్రం తట్టడంలేదు

అతనూ నేనూ వాళ్ళింటికి వెళ్ళినప్పుడు మేమిద్దరం తప్ప, బయట గాని రూంలోగాని ఎవరూ లేరు మేం వచ్చిన సంగతి ఇంట్లోవాళ్ల కెవరికీ తెలియడానికా, సావకాశంలేదు అయితే, మేం కూచున్న ఐదు నిమి

పాలకల్లా ఆ కాఫీ ఫలహారాలు ఎలా హాజరయ్యాయి? — శ్రీహరి అంత సేపూ నాతోనే వున్నాడు కాని, అక్కణ్ణించికదిలి గుమ్మంలోకయినా వెళ్లలేదే పోనీ అంటే కాఫీ తెమ్మని కేకయినా వెయ్యలేదే లెక్కగా, ఎరిగివున్నట్టు, ఆమె మా యిద్దరికి సరి పడా — రెండు ప్లేట్లతో టిఫినూ, రెండు కప్పుల కాఫీ తీసుకురావడం నాకు తీరని సమస్య అయికూచుంది

*    *    *

అన్నట్టుగానే సాయంకాలం ఆఫీసు నించి తిన్నగా శ్రీహరి ఇంటికి వెళ్లా అతనింకా రాలేదు అతని కొడుకు నన్నాఫీసు రూంలోకి తీసుకువెళ్లాడు

'నాన్నారు ఇప్పుడే వచ్చేస్తారు కూచోండి' అన్నాడు

కుర్రవాడిని చేరదీశా నెమ్మదిగా ఆ కబురూ ఈ కబురూ అడుగుతూ, నా సందేహాన్ని వెలిబుచ్చా

ఉత్సాహంకొద్దీ వాడు — —

'దాని కేముందండీ మా నాన్న గారి టేబిల్ కి ఈ బటన్ చూశారా? దీనికి బెల్ మా వంటింట్లోకి వుంది నాన్నగారు దీన్ని ఎన్నిసార్లు నొక్కితే అంత మందికి కాఫీ, టిఫినూ తెస్తుంది, అమ్మ' అని చెబుతూ, అమర్చిన బెల్ చూపించాడు

హమ్మయ్య! —

ఇంత గొప్ప ఐడియా పనిపెట్టి నందుకు శ్రీహరినీ, శ్రీహరి రహస్యాన్ని కనుక్కోగలిగినందుకు నన్ను నేనూ, అభినందించుకున్నా

అంతలోనే శ్రీహరి వచ్చేశాడు

అవాళ ఎంతో ఖులాసాగా గడిచింది

*    *    *

ఇంటికి చేరుకుంటూనే ఎలక్ట్రిషియన్ని పిలిపించా వీధివేంపు తడికలతో తయారయిన నా ఆఫీసు రూములోనించి మా ఇల్లాలి ఆఫీసు రూము అయిన పాకశాలలోకి ఒక బెల్ పెట్టించా

ఈ బెల్ ని గురించి మా ఆవిడకి బోధించి నచ్చజెప్పి ఆవిడచేత ఒప్పించ డానికే నాలుగు నెలలు పట్టింది నాకు

నాలుగు నెలలకయినా — కాదు, నాలుగు నెలల్లోనే మా ఆవిడను తర్ఫీదు చెయ్యగలిగినందుకు ఎంతో గర్వ పడ్డాను

*    *    *

తలవని తలంపుగా ఆ వేళ శ్రీహరి మా ఇంటికి వచ్చాడు అతన్ని గౌర వించి, నా తడికల ఆఫీసు రూములోకి తీసుకువచ్చా కూచోబెట్టా

అతనితో మాటాడుతూనే రెండు కాఫీలు కావాలని ఇల్లాలికి సందేశం పంపా అంటే రెండుసార్లు బటన్ నొక్కానన్నమాట

'కూచోడానికి టయిము లేదు, ఖాయ్ ఎస్తా రేపు ఉగాది పండక్కి నువ్వూ, మా చెల్లెలూ, పిల్లలూ మా యింటికి వచ్చెయ్యండి,'—అని ఆహ్వానిస్తూ, కుర్చీలోంచి లేవబోయాడు

బలవంతాన అతన్ని కూర్చోబెట్టి, మరోకసారి బటన్ నొక్కా

మరి రెండు నిమిషాలయింది

ఇంకా కాఫీ రాలే ఇల్లాలి అలికిడీ లేదు

ఒకవేళ పాలవాడు రాలేదేమో!—

లేకపోతే, పక్కింటి పిన్నిగారితో బాతాఖానీలో కూచుందో! ఆవిడ ప్రసంగిస్తూవుంటే కాలమే తెలియకుండా గడిచిపోతుంది

నా ఆత్రాన్ని తెలియజేస్తూ మళ్ళీ బటన్ నొక్కా

నా కంగారు గ్రహించినట్టున్నాడు శ్రీహరి 'నువ్వు చూస్తే కాఫీ ప్రయత్నం ఏదో చేస్తున్నట్టున్నావు వద్దురా బాబూ, మరోకసారి వస్తాలే, తీరిగ్గా' అన్నాడు

విషమ పరిస్థితి ఏర్పడింది నాకు మా ఆవిడమీద పట్టరాని కోపం వచ్చింది

'అదేం కుదరదు, మా యింటో కాఫీ అయినా పుచ్చుకోకుండా వెళతావా ?—అయితే మీ యింటికి వచ్చేదే లేదూ ' అంటూండగా — పొగలు గక్కుతున్న నాలుగు కప్పుల కాఫీతో ఆఫీసు రూములో అడుగు పెట్టింది, మా యజమానురాలు

మా యిద్దరినీ చూసి ఆశ్చర్యంతో 'తక్కిన ఇద్దరూ ఏరండీ ?—' అని అడిగింది, దీర్ఘంతీస్తూ

నేనేం బదులు చెప్పలేకపోయా

శ్రీహరి పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుతూ, "అదేమిటమ్మా చెల్లాయ్!— అలా అడుగుతావు ? నేనొక్కణ్ణీ నాకొక కప్పు మావాడు ఇద్దరు మనుషుల పెట్టు, కనుక వాడికి రెండు కప్పులు మొత్తం మూడు కప్పులు ఇలా ఇచ్చెయి తక్కింది నీకూ, ఇప్పుడు సరిపోయిందా లెఖ్ఖ ?—" అంటూ మరింత గట్టిగా నవ్వాడు

సతీ సమేతంగా నేనూ నవ్వక తప్పింది కాదు ★

# మీ నిశ్చయాన్ని పునరుద్ఘాటించండి జాతీయ రక్షణ కృషిలో పాల్గొనండి